# ఐడెంటిఫికేషన్

ఆ మరుసటి రోజున 'ఐడెంటిఫికేషన్ పేరేడ్' జరుగుతుందన్న విషయం సబ్ జైలంతా పాకిపోయింది.

సబ్ జైలు ఆవరణలోనే ఉన్న 'కిచెన్ యార్డు' లో ఖైదీలు, చిన్న చిన్న గుంపులుగా చేరి 'ఐడెంటిఫికేషన్' విషయమే మాట్లాడుకుంటున్నారు. సాయంత్రపు ఎండ, వాళ్ళ నీడల్ని మరీ పొడవు చేస్తోంది.

కిచెన్ రూమ్‌లో కొందరు ఖైదీలు వంట వండుతున్నారు. జైలు వార్డర్ వేణు అక్కడే చెక్కపెట్టె మీద కూచొని - ఓ చేతిలో లాఠీ, ఓ చేతిలో ఖాకీ కాప్ పట్టుకుని వంట తయారీని పర్యవేక్షిస్తున్నాడు.

"ఎందుకురా, బయపడతావు యల్లప్పా? యట్లయ్యేది అట్లయితాది... అన్నిటికీ ఆ బగమంతుడే ఉండాడు" అన్నాడు వెంకటేషు - పొయ్యిమీద కుతకుత లాడుతోన్న రాగి అండాలోని అన్నాన్ని తెడ్డు కట్టెతో కలియబెడుతూ.

"ఏమో నన్నా! ఏ పాపం, కర్మం గానము. ఈ జైలూ, కేసులు సూత్తావుంటే ఇంగెప్పుడూ జైలునుంచి బయటపడమేమోనని అనుమానంగా ఉంది" అన్నాడు యల్లప్ప. తిరగమోతకు ఉల్లిపాయల్ని కత్తితో ముక్కలు చేస్తూ.

"మన తలరాత అట్లే రాసింటే, మన మెంత బయపడీ చేసే దేందుందిరా - యల్లగా! ఇప్పటికి నెలనాళ్ళయింది, ఈ జెయిల్లో ఉండబట్టి... మన పెండ్లాం, పిల్లలూ యంత యేడస్తా వుండారో, కూటికి యంత కటకట పడిపోతా వుండారో, తలుసుగుంటే గుండెకాయ నీరయిపోతా వుంది" అన్నాడు విరక్తిగా తిరుపాలు అక్కడున్న ఏడుగురూ దారిదోపిడీ కేసులో ఇరుక్కున్న ఖైదీలే. వాళ్లలో వయసులో పెద్దవాడు తిరుపాలే.

వాళ్ళ మాటలన్నీ వింటూనే ఉన్నాడు వేణు. అర్ధగంట క్రితం సరుకులు తెచ్చే కాంట్రాక్టరు వాళ్ళకి 'ఐడెంటిఫికేషన్' విషయం చెవుల్లో వేసి వెళ్ళాడు అప్పటి

నుంచి, వాళ్ళ ఆందోళనని గమనిస్తూనే ఉన్నాడు వేణు.

"తొందరగా వండండయ్యా! మాటల్లో పడిపోతున్నారు. అప్పుడే నాలుగున్నర అవుతోంది" అన్నాడు వేణు, తనకి వాళ్ళ మాటలతో సంబంధం లేనట్టు. అయినా, తను వాళ్ళ గురించే ఆలోచిస్తున్నాడు. 'ఐడెంటిఫికేషన్' అంటూనే వాళ్ళు ఒకటే ఆందోళన పడిపోవడం, అతనికి ఆశ్చర్యంగా ఉంది.

వేణుకు జైలుకు సంబంధించిన విషయాలు చాలా తెలీవు. ఎంచేతనంటే - అతనికి ఉన్న రెండేళ్ళ వార్డరు సర్వీసులో చాలా భాగం, అతితక్కువ ఖైదీలున్న ఉరవకొండ సబ్‌జైల్లో డ్యూటీ చేశాడు. అక్కడి నుంచి ఏకంగా అతి ఎక్కువ ఖైదీలుంటున్న ఈ జైలుకు బదిలీ అయి వచ్చాడు - అందుకే 'ఐడెంటిఫికేషన్' అంటే ఏమిటో తెలీదు.

అరగంటలో వంట తయారైంది. అయిదు గంట లవుతున్నట్టే ఖైదీలంతా వేపచెట్టు కింద, రెండు పంక్తులు తీరి అవురావురు మంటూ భోంచేశారు.

అయిదుంపావు కల్లా, ఖైదీ లందర్నీ సెల్సులో వేసి జాగ్రత్తగా లాకప్ చేశాడు వేణు. మరో మారు అన్ని సెల్లులకీ గడియలూ, తాళాలూ సరిగ్గా పడ్డాయో లేదో, అని సరి చూసుకున్నాడు; ఓ చిన్న కాగితం పైన, ఏ సెల్లులో ఎందరు ఖైదీలున్నారో నోట్ చేసుకొని, ఆఫీసు గదివేపు నడిచాడు వేణు.

"సారీ మిత్రమా ! లేటయింది" అంటూ నవ్వుతూ ఎదురొచ్చిన, నైట్ డ్యూటీ వార్డర్‌తో "ముందు ఖైదీల్ని లెక్కేసుకు రా పో ! చార్జీ ఇస్తాను" అంటూనే ఆఫీసు గదిలోకి అడుగు పెట్టాడు వేణు.

మూడు నిమిషాల్లో జైలు గదులన్నీ ఒకసారి చుట్టేసి వచ్చాడు, నైట్ డ్యూటీ వార్డరు. అతనికి చార్జీ ఇచ్చేసి డ్రెస్సు మార్చుకుందుకు గార్డు రూమ్‌వేపు వెళుతుంటే-

"ఇద్దోవేణూ!" అంటూ పిల్చాడు సబ్‌జైలు సూపరింటెండెంటు - ఆఫీసు గదిలోంచి.

"యస్సార్ !" అంటూనే వెనుదిరిగి వచ్చాడు వేణు.

"రేపు ఉదయం డ్యూటీ నీదే కదూ?" అన్నాడు సూపరింటెండెంటు - కుర్చీకి నింపాదిగా ఆనుకుని.

"అవును సార్ !" అన్నాడు వేణు.

"రేపు ఉదయం పదింటికి 'ఐడెంటిఫికేషన్ పెరేడ్' ఉంటుంది. మేజిస్ట్రేటుగారు వస్తారు. ఖైదీలందర్నీ డిసిప్లిన్‌గా ఉండేట్టు చూడు. జాగ్రత్త, ఏం?"

"యస్సార్!"

"ఊం - వెళ్ళిరా !" అన్నాడు సూపరింటెండెంటు - గంభీర వదనంతో.

'ఐడెంటిఫికేషన్ అంటే ఏమిటి సార్?' అని అడుగుదా మనుకున్నాడు వేణు. అయితే - 'అదికూడా తెలీకపోతే వార్డరు ఎలా గయ్యావయ్యా' - అని ఎగతాళి చేస్తాడని అతని భయం. అందుకే - మౌనంగా తల ఆడించేసి గార్డు రూమ్‌లోకి

వెళ్ళాడు - డ్రెస్ మార్చుకునేందుకు. రెండు నిమిషాల్లో 'మఫ్టీ'లో తయారై వచ్చాడు వేణు.

"వేణూ! నేనూ వస్తున్నా ఉండు" అన్న పిలుపు విని తిరిగి చూశాడు.

అప్పుడే సెంట్రీ దిగిన కానిస్టేబుల్ దేవదానం కూడా మఫ్టీలో తయారయి వస్తున్నాడు - పోలీస్ గార్డు రూమ్ నుంచి.

దేవదానం వేణుకంటే ఓ పదేళ్ళు వయసులో పెద్దవాడు; సర్వీసులో కూడా అంతే. ఇద్దరూ జైలు ఆవరణ దాటారు.

"రేపు 'ఐడెంటిఫికేషన్ పెరేడ్' జరుగుతుందట కదన్నా!" అన్నాడు వేణు. జైలు వార్డర్లంతా పోలీసు కానిస్టేబుల్స్‌ని 'అన్నా', 'సోదరా' అంటూ సంబోధించడం పరిపాటి.

"అవును" అన్నాడు దేవదానం.

"ఎందుకు జరుగుతుందన్నా?" అన్నాడు వేణు. దేవదానంతో వేణుకు ఉన్న చనువువల్లనే ఆమాత్రం అడగ గలిగాడు వేణు.

"ఇంతకుమునుపు ఎన్నడూ 'ఐడెంటిఫికేషన్ పెరేడ్' జరిగినప్పుడు లేవా? అన్నాడు దేవదానం, సిగరెట్ వెలిగిస్తూ."

"ఉహూ లేను... అందుకే తెలీదు" అన్నాడు వేణు, అమాయకంగా.

"తెలీకపోతే నష్టం ఏమీ లేదులే. రెండో నంబరు సెల్లులో ఉన్నారే, తిరుపాలు అండ్ కో ఖైదీలు - నెల కిందట చింతమానిపల్లి దగ్గర జరిగిన లారీ డెకాయిట్ కేసులో, వాళ్ళని అనుమానించి కేసు పెట్టి, జైల్లోకి వేసినాము కదా! రేపు ఆ లారీ డ్రైవరూ, క్లీనరూ వస్తారు. మేజిస్ట్రేటు ఎదురుగా జైల్లో ఉంటోన్న ఖైదీ లందర్లోనూ ఆ రోజు డెకాయిట్ చేసిన వాళ్ళున్నారేమో అని చూసి, గుర్తిస్తారు."

"అలాగా?" అన్నాడు వేణు.

"'ఐడెంటిఫికేషన్' రహస్యం చెప్పినందుకు కాఫీ తాపుతావా?" అన్నాడు నవ్వుతూ దేవదానం.

"దానికేం భాగ్యమన్నా, పదా!" అన్నాడు వేణు - దార్లోనే ఉన్న కొట్టం హోటల్లోకి దారితీస్తూ.

"ఊరికే అలా అన్నాను లేవయ్యా వేణూ! ఉదయం నుంచి కడుపులో ఏమీ బాగలేదు. నువ్వు తాగు కాఫీ, నేను ఊరికే కూచుంటాను."

ఇద్దరూ హోటల్లో కెళ్ళి కూచున్నారు.

* * *

మరునాడు ఉదయం ఆరు గంటలకే డ్యూటీకి వచ్చాడు వేణు.

అతను మామూలుగా డ్యూటీకి రాగానే, జైలంతా ఓసారి కలయ తిరిగి వచ్చి, ఏడున్నరకి ఖైదీలని అన్ లాకప్ చేసే వరకూ, ఒకటో నంబరు సెల్లు దగ్గర ఉన్న స్టూలుమీద కూచుంటాడు. అక్కడి నుంచి మొత్తం జైలు గదులన్నీ కనబడతాయి.

ఎప్పటిలాగే అక్కడ కూచున్నాడు వేణు.

సెల్లుల లోంచి ఖైదీల 'గుసగుస' మాటలూ, బయట ఉన్న వేపచెట్టులోంచి రకరకాల పక్షుల కలరవాలూ కలిసి వింత శబ్దంగా వినిపిస్తోంది.

"తొందరగా అన్ లాక్ చెయ్యండి సార్! లెట్రిన్ కెళ్ళాలి !" అంటూ ఎవరో ఖైదీ కేకలు పెడుతున్నాడు.

"సార్ ! నంబర్ టూ అర్జెంటు బిరీన తియ్యండి !" అంటూ మరెవరో ఖైదీ కేకలు.

అలాంటి కేకలు, ఉదయం వేళ వినడం మామూలే వేణుకి. ఏడున్నర కానిదే, పోలీసులు రెడీ కానిదే, తనొక్కడూ అన్ లాక్ చేయకూడదు కదా. ఆ విషయం ఖైదీలకీ తెలుసు. అయినా, ప్రకృతిసిద్ధమైన తొందర వాళ్ళది.

జైలు గదులకున్న చిన్న చిన్న గవాక్షాల గుండా లేత సూర్యకిరణాలు ఎదురుగా ఉన్న గోడలమీద పడుతున్నాయి.

వెనక ఎవరో వస్తున్నట్టు అలికిడి అయితే, తిరిగి చూశాడు వేణు. కానిస్టేబులు ఈశ్వరయ్య ఇద్దరు మనుషుల్ని వెంట పెట్టుకుని వస్తున్నాడు. అతనికి పెద్ద గూనికడవ అంతటి పొట్ట ఉంది. నల్లటి బండ పెదవులు కనిపించకుండా పురులు తిరిగిన మీసాలున్నాయి. వాటికి తగ్గట్టు నల్లగా, గంభీరమైన మొహం ఉంది. మొత్తంమీద ఖాకీ డ్రెస్‌లో పోతపోసిన ఇనుప దిమ్మెలా ఉన్నాడు. అతని వెనక వస్తోన్న వాళ్ళలో ఒకడు తెల్లగా, పొట్టిగా, లావుగా ఉండి, మాసిపోయిన తెల్లటి గుడ్డలు వేసుకొని ఉన్నాడు. పది హత్యలు ఏకబిగిన చేసి, పదకొండో హత్య చేస్తూ రెడ్ హాండెడ్‌గా పట్టుబడిన వాడిలా ఉంది అతని మొహం. మరొకడు రివటలా సన్నగా, పొడుగ్గా, ఛామనఛాయలో ఉన్నాడు. అతను వేసుకున్న నీలం చొక్కా, ఖాకీ పాంటూ, కుట్టినప్పటినుంచి చాకలి మొహం ఎరక్కుండా ఒంటిమీదనే అలా మాసిపోయి ఉన్నాయి - అక్కడక్కడ నల్లటి మరకలతో. చూడగానే ఎవర్నయినా తేలిగ్గా మోసం చేసే దొంగలా ఉన్నాడు.

"ఏమయ్యా వేణూ ! నీదేనా డ్యూటీ?" అన్నాడు కానిస్టేబులు ఈశ్వరయ్య.

"అవు నన్నా! ఇంత పొద్దున్నే తెస్తే ఎట్లన్నా? తొమ్మిదికి వస్తాడు మా సూపర్నెంటు... ఏ కేసు వాళ్ళు?" అన్నాడు వేణు.

"భలేవాడివే. వీళ్ళు ఖైదీ లనుకున్నావా?" అంటూ శరీరం యావత్తూ కంపించిపోయేలా "వావావా" అంటూ నవ్వేశాడు.

"మరి?" అన్నాడు వేణు.

"పోలీసోడు ఎవర్ని వెంటబెట్టుకొని వచ్చినా నేరస్థులే నేమిటి? మొన్న డెకాయిట్ జరిగిందే - చింతమానిపల్లె దగ్గర - వీళ్ళ లారీనే దోచుకున్నది. ఈ రోజు 'ఐడెంటిఫికేషన్' ఉంది కదా, అందుకే ఉదయమే తీసుకొచ్చాను. ఇతను లారీ డ్రైవరు రంగప్ప. అతను క్లీనరు సుబ్రమణ్యం." అంటూ లావు ప్రాణినీ, బక్కప్రాణినీ పరిచయం చేశాడు ఈశ్వరయ్య.

కథా నిలయం
765
శ్రీకాకుళం

మౌనంగా వాళ్ళిద్దరి వేపు చూశాడు వేణు.

"దేంట్లోనయ్యా డెకాయిట్ ఖైదీ లుండేది?" అడిగాడు ఈశ్వరయ్య వేణూని.

"ఎందుకన్నా" అన్నాడు వేణు, అనుమానంగా.

"కావాలి లేవయ్య చెప్పు" అన్నారు ఈశ్వరయ్య.

"అద్దో – అందులో ఉన్నారు" అంటూ రెండో నంబరు సెల్లు చూపించాడు వేణు.

"మీ రిద్దరూ జాగ్రత్తగా గమనించాలి వాళ్లని. ఏం?" అంటూ లారీ డ్రైవరుకి, క్లీనరుకి సూచన ఇచ్చి, రెండో నంబరు సెల్లు వద్దకు వెళ్ళాడు ఈశ్వరయ్య. వాళ్ళిద్దరూ అతన్ని అనుసరించారు.

"మీరేనా డెకాయిట్ కేసు వాళ్ళు?" అంటూ ఖైదీల్ని ప్రశ్నించాడు ఈశ్వరయ్య. నిజానికి వాళ్ళని డెకాయిట్ కేసు ఒప్పుకోమని చితకతన్ని ఇంటరాగేట్ చేసింది అతనే.

ఖైదీల మొహాలు వెల వెల బోయాయి – ఈశ్వరయ్యని చూడ్డంతోనే.

"అవును సార్ !" అన్నాడు తిరుపాలు బలహీన స్వరంతో.

లారీ డ్రైవరూ, క్లీనరూ పరిశీలనగా చూస్తున్నారు ఖైదీల్ని.

వేణు లేచి, వాళ్ళ దగ్గరి కొచ్చాడు.

బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు ఖైదీలు – లారీ డ్రైవర్నీ, క్లీనర్నీ.

అయిదు నిమిషాల పాటూ ఖైదీల్ని చూపించి – "ఇక పోదాం పదండి!" అంటూనే, టకటక అడుగులేస్తూ తిరుగుముఖం పట్టాడు ఈశ్వరయ్య – లారీడ్రైవరూ, క్లీనరూ వెంట నడిచారు.

వేణు మాత్రం అక్కడే నిలుచున్నాడు.

"ఎంత అన్యాయం సార్ ఇది! మీరు కూడా ఆ పోలీసోల్లతో చేతులు కలిపితిరా? మా బతుకుల్లో అందురూ కలిసి నిప్పులు పోస్తా వుండారు కద సార్!" అన్నాడు తిరుపాలు, జీరపోతున్న కంఠంతో.

"ఏం తిరుపాలూ, అట్లంటున్నావ్?" అయోమయంగా మొహం పెట్టి, అన్నాడు వేణు.

"లేకపోతే ఏంది సార్ ఈ పని? ఆ పోలీసోల్లు పిలుసుకోని వచ్చింది యెవుర్ని – ఆ లారీ డ్రైవర్నీ, క్లీనర్నీ కాదా? ఈ పోలీసే మమ్మల్ని ఆ పొద్దు తన్ని, నేరం వొప్పించిండేది... ఇప్పుడు మమ్మల్ని బాగా గుర్తుపట్టమని చూపిచ్చుకొని బోయినాడు – ఇంగేముంది? మేజిస్ట్రేటు ఎదురుంగా సులకాగ మమ్ముల్ని గుర్తుపడతారు. మా బతుకింతే, ఈ జెయిల్లోనే. వాళ్ళతో మీరు కూడా సేరిపోతిరా?" అంటూ ఆక్రోశంగా అన్నాడు వెంకటేసు.

"నేనేం జేసినాను? ఎవరివైపూ చేరలేదు. నా ఉద్యోగం నాది" అన్నాడు వేణు.

"అట్టనద్దండ్రి. మీకు తెలియకుండా జెయిల్లోకి ఎట్లొస్తారు సార్. మీ పరిమిసను వుండల్ల కదా!"

"సరేలేవయ్యా! నేను అవన్నీ, ఊహించలేదు. ఏదో మాట్లాడుతానంటే పంపిస్తిని. అది సరే కానీ, మీరు డెకాయిట్ చేయలేదు కదా! మరి ఇంకెందుకయ్యా భయం?"

"మేము ఏ నేరమూ జెయ్యలేదని మాకు దెలుసూ, అ పైనుండే బగమంతునికి దెల్సు సార్! దాన్ని నిరూపిచ్చుకొనేకి శాతకానోళ్ళం మేము, ఈ పోలీసోల్లు మా మింద నేరం రుద్దినారు. దాన్ని బలపరుసుకొనేకి 'ఐడెంటిఫికీసను' లో మమ్మల్ని బాగా గుర్తు పట్టేదానికి అ లారీ డ్రైవర్నీ, క్లీనర్నీ పిలిపిచ్చి సూపిత్తా ఉండారు. ఇంగేందుంది? మా బతుకులు బుగ్గిపాలయి పోయె. యా దేవుడు కూడా రచ్చించలేదు సార్ మమ్మల్ని" అన్నాడు తిరుపాలు.

మౌనంగా ఖైదీల వేపు చూస్తున్నాడే కాని, అతని మనసు తప్పు చేసినట్టు ఫీలవుతోంది. తనకు తేలీకుండానే అన్యాయానికి తోడ్పడినందుకు లోలోపలే మథనపడిపోతున్నాడు వేణు.

అక్కడి నుంచి గిరుక్కున తిరిగి గబగబా అంగలు వేస్తూ, ఆఫీసు గది ముందు నిలబడి మాట్లాడుతోన్న ఈశ్వరయ్య వద్ద కెళ్ళాడు.

"ఈశ్వరయ్యన్నా! ఇదేం బాగలేదు – 'ఐడెంటిఫికేషన్ పెరేడ్' కి ముందే ముద్దాయిల్ని చూపించడం అన్యాయం కదా! నిజంగా డెకాయిటీ జరిగిన రోజున వీళ్ళు ఎవర్ని చూశారో ఐడెంటిఫికేషన్ పేరేడ్‌లోనే గుర్తించడం పద్ధతి..." అంటూ వేణు ఆవేశంగా చెప్పుకుపోతుంటే, అడ్డు తగిలాడు ఈశ్వరయ్య.

"నీకేం తెల్దులేవయ్యా. కేసు బలంగా నిలబడల్లంటే, ఇట్లే చేయాల్సింది. న్యాయా న్యాయాలు, పద్ధతులూ, గిద్దతులూ లెక్కేస్తా కూసుంటే, మేమంతా ఉద్యోగాలు ఊడగొట్టుకోని ఇంట్లో కూసోవల్ల – తెల్సిందా?"

"మీ రిట్లా జేస్తారని తెలిసుంటే జెయిల్లోకే అడుగు పెట్టనిచ్చేవాణ్ణి గాదు. ఇది అన్యాయం అన్నా!"

"చాలు చాలు లేవయ్యా! నువ్వెవరివి, నన్ను లోపలికి అడుగు పెట్టనివ్వకపోవ డానికి? ఈ సబ్ జైలు మీ జైలు డిపార్ట్‌మెంటు సొంతమైతే కావొచ్చు కానీ, దీన్ని కంటికి రెప్ప కట్ల చూసుకుంటు వుండెదెవరు? మా పోలీసు వాళ్ళు కాదా? అంటే ఈ సబ్ జైలు మీదే కాదు, మాది కూడా. నీ ఇష్టమొచ్చినోణ్ణి అడుక్కో పో, కావాల్సి వుంటే" అంటూనే వేణుకి మరికాస్త దగ్గరికి వచ్చి –

"ఏమిటయ్యా! మనం మనం హోం డిపార్ట్‌మెంటు వాళ్ళం. ఇట్లా కేసుల్లో ఇదేరకంగానే వ్యవహారం నడపాలి. నేను చెప్పడమెందుకులే, నువ్వే తెల్సుకుంటావ్. అంత టిరీన నన్ను అపార్థం చేసుకోకు. ఏం – వస్తా!" అంటూ వేణు గడ్డాన్ని సుతారంగా చేత్తో వత్తి, వెళ్ళిపోయాడు ఈశ్వరయ్య – లారీ డ్రైవర్నీ, క్లీనర్ని వెంటేసుకుని.

వేణు మనసు అదోలాంటి బాధతో నిండిపోయి ఉంది. రెండో నంబరు సెల్లులో ఖైదీలంటే అతనికి సానుభూతి ఎక్కువ. నిజానికి వాళ్ళు డెకాయిటీ చేయలేదని అతని నమ్మకం.

ఏడున్నర అవడంతోటే ఖైదీలందర్నీ అన్ లాకప్ చేశాడు వేణు. పోలీసు గార్డు సాయంతో ఖైదీల్ని కిచెన్ యార్డులోకి తీసుకెళ్ళాడు.

ఆవేళ తొందరగా వంటచేసుకొని, భోజనాలు కూడా చేసేశారు ఖైదీలంతా.

పది గంటలు అవుతుండగా కిచెన్ యార్డులోనే ఓ పెద్ద టేబులూ, మూడు కుర్చీలు వేసి ఉంచారు.

సరిగ్గా పది గంటలకి... పోలీసులతో గౌరవ వందనం స్వీకరిస్తూ కిచెన్ యార్డులోకి అడుగు పెట్టాడు మేజిస్ట్రేటు, అతని వెనుక సబ్ జైలు సూపరింటెండెంటు, కోర్టు బెంచి క్లర్కు ఉన్నారు.

ముగ్గురూ టేబుల్ ముందున్న కుర్చీల్లో ఆసీనులైనారు.

కిచెన్ యార్డు బయటనుంచి లారీ డ్రైవరూ, క్లీనరుతో సహా గార్డింగ్ స్టాఫ్ కానిస్టేబుల్సు తొంగి తొంగి చూస్తున్నారు.

"ఖైదీల్నందర్నీ ఒక వరసలో నిలబెట్టు!" అంటూ బెంచి క్లర్కు, తనే మేజిస్ట్రేటు లెవల్లో వార్డరుకి హుకుమ్ జారీ చేశాడు.

"అట్లాగే సార్!" అంటూ అందర్నీ ఒక వరసలో నిలబెట్టాడు వేణు.

"ఐడెంటిఫై చేసే వాళ్ళని రమ్మనండి !" అన్నాడు మేజిస్ట్రేటు.

ఓ పోలీసు పరిగెత్తు కెళ్ళి, లారీ డ్రైవర్నీ, క్లీనర్నీ పిలుచుకొని వచ్చాడు.

"చింతమానిపల్లి దగ్గర దారిదోపిడీ జరిగినప్పుడు, మీరు ఆ నేరస్థుల్ని చూశారా?" ప్రశ్నించాడు మేజిస్ట్రేటు.

"చూసినాము సార్ !" అన్నా రిద్దరూ ముక్తకంఠంతో.

"ఇక్కడ వరసగా ఖైదీలంతా నిలుచుని ఉన్నారు. వాళ్ళలో ఆ నేరస్థులెవరో గుర్తించండి అన్నాడు మేజిస్ట్రేటు. సరే అన్నట్టు తలలూపి, ఖైదీల దగ్గర కెళ్ళారు ఇద్దరూ."

పాతిక మంది ఖైదీలు వరుసతీరి నిలుచుని ఉన్నారు. వాళ్లలో డెకాయిటీ కేసు ఖైదీలు, మధ్య మధ్యలో – నిలుచుని బిక్కు బిక్కు మంటూ చూస్తున్నారు.

లారీ డ్రైవరూ, క్లీనరూ ఒక్కొక్కర్నే పరిశీలించి చూస్తూ ఉన్నారు.

డెకాయిటీ ఖైదీల మొహాలు, కత్తివేటుకి నెత్తురు చుక్క లేనంతగా, పాలిపోయి ఉన్నాయి. తమ మొహాల్లో ఆందోళన కనబడితే, తొందరగా వాళ్ళు గుర్తించే ప్రమాదం ఉంది కదా అని, లేని సంతోషాన్ని మొహాల్లో తెచ్చుకోవాలని ప్రయత్నించి విఫలు లవుతున్నారు.

అందర్నీ చూశాక డ్రైవర్నీ, క్లీనర్నీ చాటుకు తీసికెళ్ళారు పోలీసులు.

ఈలోగా డెకాయిటీ కేసు వాళ్ళ చొక్కాల్ని విప్పించి, ఇతర ఖైదీలని వేసుకోమన్నారు, ఇతర ఖైదీల చొక్కాల్ని, డెకాయిట్ ఖైదీలని వేసుకోమన్నారు.

అయిదు నిమిషాల్లో ఆ కార్యక్రమం పూర్తి కాగానే అందర్నీ వరసలో నిలుచోబెట్టారు.

డ్రైవరూ, క్లీనరూ వచ్చారు. అందర్నీ పరిశీలించి చూశారు. మళ్ళీ వాళ్ళని చాటుకు తీసుకెళ్ళారు.

మూడోమారు ఖైదీలందరిచేతా చొక్కాల్ని విప్పదీయించి, అండర్ వేర్లతో మాత్రం నించోబెట్టారు.

డెకాయిట్ ఖైదీలు మరీ టెన్షన్‌గా ఫీలవుతున్నారు.

వేణుకి మాత్రం – పోలీసులు మేజిస్ట్రేటు ముందు ఆడుతోన్న నాటకం లాగుంది. 'పొద్దున్న చూసిన ఖైదీల్ని గుర్తుపట్టడానికి ఇన్ని హంగు లెందుకు?' అని అరిచి చెబుదామని అనిపిస్తోంది అతనికి.

ఈసారి కూడా ఖైదీల్ని పరిశీలించడానికి డ్రైవరూ, క్లీనరూ వచ్చారు.

మరీ నిదానించి చూస్తున్నారు. అందరి మొహాల్లోకి గుచ్చి గుచ్చి చూస్తున్నారు. పరిశీలించి చూశాక మేజిస్ట్రేటు ముందు కొచ్చి నిల్చున్నారు.

"పరిశీలించారా?" అడిగాడు మేజిస్ట్రేటు.

"అవును సార్!" అన్నారు ఇద్దరూ.

"డెకాయిట్ నేరస్థుల్ని గుర్తించారా?"

"గుర్తించలేదు సార్! అసలు వీళ్ళలో ఉన్న నేరస్థులెవర్నీ ఆరోజు మేం చూసినట్టు జ్ఞాపకం లేదు సార్!" అని డ్రైవరూ, క్లీనరూ అదేమాట చెబుతోంటే, ఖైదీలంతా రిలీఫ్‌గా ఫీలయ్యారు. ముఖ్యంగా డెకాయిట్ కేసు ఖైదీలు.

వేణు ఆశ్చర్యంలో మునిగిపోయాడు. ఈశ్వరయ్య, అదేపనిగా ఫలానా ఖైదీల్నే డెకాయిటీ ఖైదీలుగా గుర్తించాలి, అని చూపించినా, ఏడుగురిలో ఒక్కర్నీ గుర్తించలేక పోయారంటే... క్రూరంగా కనిపించే డ్రైవర్, క్లీనర్ల మనస్తత్వం అతనికి మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

"మరో అవకాశం కలిగిస్తున్నాను. వెళ్ళి గుర్తించగలరేమో, చూడండి !" అన్నాడు మేజిస్ట్రేటు.

"ఎన్నిసార్లు చూసినా ఒకటే సార్! వీళ్లలో ఆ రోజు మా లారీని దారిదోపిడి చేసిన దొంగలు లేరు" అన్నాడు డ్రైవరు.

"మా బాస్ చెప్పిన మాటే నాది కూడా – సార్ !" అన్నాడు క్లీనరు.

డెకాయిట్ కేసు ఖైదీల ఆనందానికి అవధులు లేవు.

పోలీసుల మొహాల్లో కోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఐడెంటిఫికేషన్ పెరేడ్ కాగానే మేజిస్ట్రేటూ, బెంచి క్లర్కూ, సబ్ జైలు సూపరింటెండెంటూ వెళ్ళిపోయారు.

పదకొండు గంటలకల్లా ఖైదీల్ని లాకప్ చేయడం అయిపోయింది. ఆ విషయం సూపరింటెండెంటుతో చెప్పడాని కని, ఆఫీసు గదికి వెళ్ళినప్పుడు - సూపరింటెండెంట్ ... "ఈ రోజు నైట్ డ్యూటీ వార్డరు, వాళ్ళ నాన్నకి సీరియస్‌గా ఉందని సెలవు పెట్టాడయ్యా! ఆ డ్యూటీ నువ్వు చెయ్యాలి. సాయంత్రం ఆరుకే డ్యూటీకి వచ్చెయ్యి" అని నోటితోనే ఆర్డరు వేశాడు.

"సరే సార్! అలాగే..." అనేసి ఆఫీసు గది బయటికొచ్చేశాడు వేణు.

* * *

సబ్ జైలు ఆవరణలో ఉన్న ఫ్లోరసెంటు దీపం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. చిన్న చిన్న దీపం పురుగులు వేగంగా రెక్కలాడిస్తూ నాట్యాలు చేస్తున్నాయి.

వేణు జైలు వరండాలో ఉన్న కుర్చీలో కూచుని చిత్తుకాగితంపైన లెక్కలు వేస్తున్నాడు. జీతం అందుతూనే ఎవ రెవరికి ఎంతెంత డబ్బు ఇవ్వాలో తెలిపే లెక్కలు అవి.

కొద్ది దూరంలో ఆరుగురు కానిస్టేబుల్స్, జోరుగా పేకాట ఆడేస్తూ ఉన్నారు.

కానిస్టేబులు జానయ్య మాత్రం సెంట్రీ డ్యూటీలో ఉన్నందువల్ల పూర్తిగా ఖాకీ యూనిఫామ్‌లో ఉన్నాడు. సెంట్రీ డ్యూటీ చేసే వాళ్ళెవరైనా అటెన్‌షన్‌లో, చేతిలో తుపాకితో నిలబడి ఉండాలి. అయితే - సబ్ జెయిల్లో ఏ సెంట్రీ కూడా పాటించదు. - ఏ పోలీసు అధికారులు వస్తేనో తప్ప. అలా అలవాటైనవాడే జానయ్య. అందుకే వరండాలో గోడకు చేరగిలవడి ఉన్నాడు, అతనిలాగే అతని తుపాకీ కూడా గోడకి ఆనుకొని ఉంది.

అప్పుడు సమయం ఏడు గంటలైనట్టు, దూరంగా ఉన్న పోలీసు ఠాణాలోంచి గంటలు శబ్దం వినిపిస్తోంది.

"ఏం ఈశ్వరయ్యా ! ఏం జేస్తిరి వాళ్ళని?" అంటూ జానయ్య అడుగుతోంటే తలెత్తి చూశాడు వేణు. ఈశ్వరయ్య అప్పటికే వరండా మెట్ల దగ్గర నుంచుని ఉన్నాడు.

"ఆ లం...కొడుకులు భలే మోసం జేసినారన్నా! ఈ పొద్దు పొద్దన్న అదేపనిగా ఆ డెకాయిట్ నాకొడుకుల్ని చూపించినాను. ఒక్కరంటే ఒక్కరన్నా గుర్తుపట్టినట్లు చెప్పొద్దా? అందుకే కొడితిమి చూడు, పిచ్చి కొట్టుడు కొట్టినాములే. వాళ్ళ తల్లో జేజెమ్మ కనిపిచ్చేదట్ల కొట్టినాము" అన్నాడు ఈశ్వరయ్య రాక్షసానందంతో.

"కొట్టాల్సిందే అట్లా నా కొడుకుల్ని..." అన్నాడు జానయ్య - తనకు డ్రైవర్నీ, క్లీనర్నీ తన్నే అవకాశం లేనందుకు కించిత్తు బాధపడుతూ.

"ఎవర్ని జానయ్యన్నా?" అన్నాడు వేణు.

"ఇంకెవర్నీ ఆ నాకొడుకుల్నే. పొద్దన్న 'ఐడెంటిఫికేషన్' కోసరం వచ్చిన ఆ డ్రైవర్ నాకొడుకునీ, క్లీనర్ నా కొడుకునీ.... పైగా వాళ్ళు సులభంగా గుర్తించేటట్టు కిచెన్ యార్డు బయటినుంచి కూడా ఫలానా ఫలానా ఖైదీలే డెకాయిట్ ఖైదీలు అని చూపించాను..." అన్నాడు.

"నిజంగా డెకాయిట్ చేసినవాళ్ళు అందులో లేరని వాళ్ళకీ తెలుసు కదా - అందుకేనేమో అబద్ధమాడలేదు" అన్నాడు వేణు.

"ఆ లోఫర్... లంజాకొడుకుల్ని అసలు నేరస్థుల్ని గుర్తించమని గుంజలాడినామా? అందుకే గదా పొద్దన్నే వచ్చి అన్ని తంటాలూ పడింది! పైగా ఏమంటారు ఆ నాకొడుకులు - 'నేరం చెయ్యని వాళ్ళని ఎట్లసార్! దొంగలుగా గుర్తించేది? చూసి చూసి మేజిస్ట్రేటు ముందర, ఏ పాపం ఎరగనోళ్ళని నేరస్థులుగా చూపడం, మావల్ల గాదు సార్. ఒకేళ చూపించినా, వాళ్ళ పెండ్లాం బిడ్డల ఉసురు మాకు తగలదేం సార్!" అంటూ నన్నే అడుగుతారు గదా - అందుకే బూటుతో ఎగిచ్చి మూతిమీద తంతి..." అంటూ ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు.

"పాపం! మంచివాళ్ళే కదన్నా !" అన్నాడు వేణు.

"ఏం మంచి? ఎవుడి క్కావల్ల ఆ మంచి? ఇంకా మనమే మంచివాళ్ళం. వాళ్లమీద ఏ కేసయినా పెట్టి బొక్కలోకి తొయ్యలేదు..." ఈశ్వరయ్య అలా అంటూంటే

లారీ డ్రైవరు, క్లీనర్ల 'నిజాయితీ' కి మనసులోనే జోహారు చేశాడు వేణు.

(ఆంధ్రప్రభ వీక్లీ 15-3-89)